# పిల్ల మెచ్చిన వాడు

“ఆడంగి యెదవ. వాణికి పెళ్ళేంది?” అంది సుక్కమ్మ, కళ్ళెఱ్ఱజేసి తల్లిని సురుగ్గా సూసి.

ఏందే నువ్వుకూసేది! పొద్దన్నే? ఏం పన్లే పొద్దన్న లేస్తానే గుడ్డలకుపోకుండా ఒకటే సోదీ నువ్వూను. వాడికీ ఏం పన్లే! నీకంతకు ముందే మతి సల్లేదు. సరిపోయిందిరా జత; అత్తా అల్లుళ్ళకు!” అంది రాజి తాడు కొసపట్టుకొని బకెట్‌ను గభీలు మని బావిలోపడేసి.

“ఓసి ఏం పోయ్యే కాలమే. అట్ల బాయిలో గభీల్మని ఏస్తే ఆ బకెట్టు ఎన్నాళ్ళొస్తాదనీ. ఆ... యిందాకా ఏందే. నువ్వేంది? ఆడు నా అల్లుడా! నా తల్లి లచ్చిందేవంటిది! దానికి కిష్నమూర్తంటి మొగుడు రాడూ! ఇస్తిరీ సేసేడంటే ఇనిసి పెట్టు కూడా ఓటే ఇదయిపోడూ. ఈ యెదవకి ఇస్తిరీ కూడ సేత కాదు. ఎట్లా బతుకుతాడో ఏం పాడో సచ్చు పీనిగ!”

“నిన్ను గుడ్డలకు పొమ్మంటే ఇంకా అవే కూతలేనా. పాడుకూతలు. పొద్దన లేచీ లేవంగానే, ‘కుకుక్కూ’ మని పెట్ట కోడిమాదిరి.”

“ఏందే...నువ్వు నన్ను గదమాయించేది? నియట్టా కూతుర్లని ఎందర్ని సూళ్ళే నేను! అబ్బ సెప్పొచ్చింది మాలావు. ఇట్లా తిక్క ముండ గనకే ఆ యాడంగితోత్తు అట్ల నీ యెంటపడి సచ్చేది! సర్లే...నే పోయొస్తాగాని, కొంచెం ఉడుగ్గా తిండి సేసి

పెట్టు. ఇయాల ఎండ సురుగ్గావుంది. తొందరగపోయి తొందరగ వొచ్చేద్దాము'' అని జుత్తువిసిరి...ముడేసుకొని ఠీవిగా నడుస్తా పోయింది సుక్కమ్మ.

''ఏం తల్లిరా...బంగారు తల్లి...నోరు తప్పించి ఇంకేం పసలేదు'' అనుకొంది రాజి. వంటింట్లో పొయ్యి ముట్టిస్తా వుంటే, రంగడొచ్చాడు. వచ్చీరాగానే మూట పెద్దింట్లో పడేసి వచ్చి –

''పిల్లా''అని ఆపిల్ల జడ పట్టుకొన్నాడు. వంగి కూర్చున్న దల్లా విసురుగా లేచింది రాజి. ఆ లేవడంతో జడ పట్టు తప్పింది. రంగడి గుండె గుభేలు మంది.

''ఏందిరా నీ యవ్వారం. ఒంటరిగా సూసి ఆడదాని జడ పట్టుకొని యాందిరా నువ్వుసేసేది?'' అని ముఖమంతా ఎఱ్ఱగా చేసుకొని ఉరిమి చూసింది రంగణ్ణి.

''ఆ...ఏమీ లేందే ఊరికే ఎగిరి పడ్తావేం'' అన్నాడు రంగడు.

''నే నేమీ అనందే నువ్వట్లా ఏడుపు మొగం పెడ్తావేం. అట్లా కాబట్టే నిన్ను పనికిరాని ఎదవజేసి అమ్మ ఆడిస్తోంది!'' అంది రాజి.

ఈ మాటతో రంగడికి వొళ్ళంతా ఆనందం తో పుల కించి పోయింది.

''ఛా! నువ్వు చెప్పేదీ రైటే. ఇంక ఇట్లా కాదులే. మీ యమ్మ అంతు తేలుస్తాలే. . . నువ్వు వూఁ అంటే చాలు, ఏమన్నా చేసేస్తాను.'' అన్నాడు.

"అబ్బ! ఇంకేం!" అంది నవ్వుతూ రాజి.

'యేమనుకొన్నావో' అన్నట్లు చూసి రంగడు పిల్ల ప్రక్కకు వెళ్లి మెడమీద చేయివేసి "మంచి పిల్ల. ఈ పూట మా రాజి ఏం సోగ్గా వుంది!" అన్నాడు. అతడి వేళ్లు వొణక సాగింది. గస రాసాగింది.

"ఏయ్" అని అతడి చేతిని తీసి విసిరికొట్టి నవ్వేసింది రాజి.

"పెద్ద మొగోణివిలే. మెళ్ళా, బయటికి" అని వీపు మీద రెండు గుద్దులేసి బయటికి నెట్టింది.

"అగ్గి ముండ" అని గొణుక్కున్నాడు రంగడు. రాజి "ఏందిరా గొణిగేది!" అని లోపలినుంచి వురిమి చూసేసరికి పెద్దింట్లోకి దాటుకొన్నాడు రంగడు.

రాజి వంట ముగించే సరికి చుక్కమ్మ పెద్ద బట్టలమూట తీసుకొని వచ్చేసింది. వచ్చినప్పటి నుంచీ రంగణ్ణి దీవిస్తూనే వుంది.

వచ్చీ రాగానే రంగణ్ణి చూసి, "ఛీ...నీ బ్రతుకు పాడవ్వా" అని అంత పెద్ద మూటను 'ధన్ను'మని అతడిమీద పడేసింది.

"సచ్చాన్రో...అమ్మో...అమ్మో..." అని లేచి వీధి లోకి జారుకొన్నాడు. ఇంట్లోకి వస్తూ వీధిలో రాజి కనిపించింది.

"ఏం అట్లా అరిశావేం" అంది కోపంగా.

"అత్త...అత్త..." అని గొణిగాడు రంగడు.

"ఏం.. అత్తయితే సంపేస్తుందా? అట్లా శారెత్తి పారిపోయొస్తావేం. ఇట్లా పిరికి ఎదవ్వి గనకే అమ్మ నిన్నట్ల బెదిరిన గొడ్డును తరిమినట్లు తరిమేది. పదా! లోపలికి పద అన్నమయింది. తినేసి ఏటికి పోదాం. చేనా పొద్దు పోయింది" అని వీపుమీాద తట్టి ముందుకు తోసింది.

"ఇంట్లో తల్లి, వీధిలో కూతురు. ఇద్దరూ గయ్యాళి గంపలేరా తండ్రీ. సందు చూసుకొని మావ్వూరికి వుడాయించేస్తాను" అన్నాడు లోపలికొస్తూ కొంచెం స్వగతంగా రంగడు.

"పోతే ఏంరా! నువ్వు ఉన్నా ఒకటే పోయినా ఒకటే. ఆరేళ్ళబట్టి నాకొంపలో పడున్నావు. ఇంతవరకు సరిగా ఇస్త్రీ సేయడం సేతకాదు. తెల్లగా గుడ్డ వుతకడం సేతకాదు. సిగ్గు లేనోడా. పోరా. నువ్వుపోతే ఈ కొంపకు పీడా వొదులుతుంది!" అని మీాది కొచ్చింది చుక్కమ్మ.

అమ్మను దూరంగా లాగి—

"మహా నిర్వాకం చేసేవులే! వాడేగాని లేకుంటే ఈ పాటికి వూరొదిలి అలో లక్ష్మణా అని అడవులు పట్టి పోయుందుము. మగదిక్కు లేదని వాణ్ణి తెచ్చుకొని ఇప్పుడు వాణ్ణి మెత్తవాణ్ణిచేసి ఆడిస్తున్నావు. నువ్వే వాణ్ణి ఆడంగిని చేసింది. వాళ్ళమ్మగ్గాని తెలిస్తే, నీ జుట్టు పట్టుకొని పొరక్కట్టతో కొట్టుంది" అంది రంగడి తరఫున వకాల్తా పుచ్చుకొని రాజి.

"వాణ్ణి ఎనకేసుకొని రాబాకని ఎన్నితూర్లు నీకు సెప్పేది? వాళ్ళమ్మ పీడికన్నా ఇంకా మొద్దమ్మ. దానికి తూరుపేదో పడమటేదో కూడా తెల్దు" అంది చుక్కమ్మ.

"ఇంక సడేలే యవ్వారం. గతికేసి ఏటికి పోదాం పదండి" అని ప్రశాంతమైన తన ముఖాన్ని రంగడికేసి త్రిప్పి చిరునవ్వు నవ్వుతూ రాజి వంటింట్లోకి వెళ్ళింది.

కబురందుకొని కాకిలా వచ్చి వాలింది సుబ్బమ్మ. ఇక్కడ కొడుకు నిర్వాకం చూసి సిగ్గుపడింది. ప్రయోజకుడవుతాడని పంపిస్తే చవటల్లే తయారయిపోయి ఒకటే ఆడంగి మాటలు చేష్టలు వినడానికీ చూట్టానికీ రోతగా వున్నాయి. తల్లీ కూతుర్లు ఒకటే వాగుడుకాయలు. మగమహా రాయుళ్ళల్లే పెత్తనం చెలాయిస్తూ రంగణ్ణో పెట్టమారి వాడుగాచేసి ఆడిస్తున్నారు. ఇవన్నీ గమనించి ఆవేదనతో, ఎవరితో ఏమీ మాటాడక ముభావంగా వుండి పోయింది.

ఆ సాయంకాలం ఉతికిన బట్టలు గాడిదలమీదవేసి, వాటిమీద అజమాయిషీకి రంగణ్ణి వదలి చుక్కమ్మా, రాజీ త్వరగా ఇంటికి వచ్చేశారు.

వాళ్లను చూడగానే సుబ్బమ్మకు వళ్లు మండింది.

"మావాణ్ణెక్కడ తోలేశారు...ఏం పిల్లా నీ జీతగాడేడీ?" అంది.

"ఏమొదినా...చేనా కోపంగా మాట్లాడు తున్నావూ! నీ కొడుకేం జంతువా తోలేయడానికి?" అంది చుక్కమ్మ గట్టిగానే!

"వాడేం బికారి ఎదవా ... జీతగాడవ డానికి" అంది చురుగ్గా అత్తను చూసి రాజి.

"నేను సరీగానే చెప్తిన్లే! కాకుండాపోతే నీమొగుడయ్యే వాణ్ణి వాడు వీడు ఎదవా గిదవా అంటావా...ఇట్లాంటె గయ్యాళ్ని చస్తే నాకొడుక్కు చేసుకోను!" అని పైకి లేచింది సుబ్బమ్మ.

"ఏమన్నావమ్మా...తల్లీ. నీకొడుక్కి నా బంగారు బొమ్మనిస్తాననా! మేమొచ్చి నీ కొడుకువంటి శూరుడు సొగసుగాడు ఇంక ఈ భూమండలం మొత్తంలో లేడని నీకాళ్లు పట్టుకొంటామనా? అసలా ఆడంగి ఎదవకు పెళ్లేంది? హూఁ..." అనేసి పెరట్లోకి పోయింది చుక్కమ్మ.

"ఏమన్నావే! ఎవరు ఆడంగి ఎదవ? వాడి మెత్తదనం చూసి...వాణికి ఈ పిల్లను ఆశచూపించి కులుకు చూపించి నోరెత్తకుండా చేసి మీ యిష్ట మొచ్చినట్లు చేసి ఆడించి, మొద్దును చేసేసినారు" అంది.

"మేమేమీ చేయలేదు. నీ కొడుకు తత్వమే అంత?" అంది రాజి.

"నోరు ముయ్యవే యింక. నువ్వా ఆ తల్లికేం తీసిపోవులే! దరిద్రపుమొగం మళ్ళా మాట్లాడుతోంది" అని ముఖం చిట్లించి ఇంకో ప్రక్కకు తిప్పుకుంది.

"ఎవరు దరిద్రపు మొగం. నీది దరిద్రపు మొగం. నీ కొడుకుది దరిద్రపు మొగం. నాకేం లక్షణంగా ఉన్నా!" అని బిగ్గరగా అంటూ మీది కొచ్చింది రాజి.

"అమ్మో గయ్యాళిగంపా! ఆకళ్లు అట్లా మండుతావేమే! అవ్వ! మావాడే గాని నిన్ను చేసుకుంటే, వాణ్ణి రెండు

రోజులకు మరిపించేసి, కుక్కను చేసేసి, రోజు కో ఎదవతో...
కులికి..."

"అత్తా...వూరుకో యింక...జాస్తీఅయి పోతోంది నీకథ! నేనేం రంకులాడిని కాను. నీకొడుకేం మాఅమ్మ అనేట్లు ఆడంగి కాదు. బావ చాల మంచివాడత్తా" అంది రాజి మెత్తగా.

"చాల్లే నీ నంగనాచి కబుర్లు. నన్ను బేలించి వాణ్ణి చేసుకొని, వాణ్ణి నీ చేతిలో కీలుబొమ్మగా చేసుకొని, వాణ్ణి అడ్డుగా పెట్టుకొని తైతక్క లాడాలను కొంటున్నావేమో. నాదగ్గర అవేం సాగవు. తెలిసిందా. ఇంక నీకో దండం. నీ తల్లికో దండం. రేపు వాణ్ణి పిలుచుకొని మా వూరికి పోతా. నాలుగిళ్లు వుతుక్కొని బతుకుతాం" అంది ఖచ్చితంగా సుబ్బమ్మ.

ఇంతలో గాడిదలు తలలొంచుకొని లోపలికి వచ్చాయి.

"వీట్ని తోలేసి ఎక్కడో పెత్తనాలకు పోయాడు. రాని ఈ రోజు చెప్తాను" అంది చుక్కమ్మ.

"ఊరుకోమ్మా. అత్త వుందని కూడా లేకుండా ఒకటే వాగుతున్నావు" అంది రాజి.

"అననీ! ఇన్నాళ్ళూ వాణ్ణి ఎట్లా చూసినారో తెలుస్తా వుందిలే. ముందు వాడు రానీ చెప్తాను. ఆడంగులకు లొంగిపోయి చవటయి పోయినాడు" అని వీధిలోకి వెళ్లింది సుబ్బమ్మ.

ఇదే విషయంమీద తల్లీ కూతుళ్ళు బిగ్గరగా వాదులాడుకోసాగారు. వీధిలోంచి అంతా వింటూ—

"అవ్వ...రాక్షసుల్లా తండ్రీ" అనుకొంది సుబ్బమ్మ. "వాడొస్తే అయ్యానోళ్ళ రెంటికి పోయి అన్నం వేయించుకు రమ్మను."

అని రెండు గిన్నెలు బుట్టలో వేసుకొని రైతు లిండ్లకు అన్నానికి బయులుదేరింది చుక్కమ్మ. పోతూ పోతూ వీధిలో నిల్చున్న సుబ్బమ్మను ఉరిమి చూసింది.

"ఏమిా" అని కసురుకొంది సుబ్బమ్మ. చుక్కమ్మ ఇక తిరిగి చూడకుండా అదే...పోయింది.

మరి కొన్ని నిముషాల్లో రంగడు వచ్చాడు.

"ఏమ్మా ఈదిలో నిల్చుకున్నావూ. అన్నం తిన్నా?" అన్నాడు.

"తిని...ఏడ్సినట్లే వుందిలే బతుకు. చిన్నప్పుడు ఎంత ధైర్యమంతుడివి...ఇప్పుడు యిట్ల ఈ ఆడంగులకు అడకువై పోయి ఎంత మొద్దయి పోయినావురా...రంగా...పోనీ!...ఆ పాపం ఆ తల్లీ కూతుర్లే అనుభవిస్తారు. రేపు తెల్లారి లేవగానే మనం వూరు కెళ్లిపోదాం. నువ్వొచ్చేస్తే, పెద్దింటోళ్లు కూడా, ఇస్తిరీ పెట్టితీసిచ్చి, గుడ్డలు మనకే యేస్తామంటా వుండారు." అందామె.

"నేనొచ్చేస్తే...పాపం అత్తా, రాజీ...అల్లాడిపోతారు కదమ్మా! పాపం రాజిని అత్త సంపేస్తుందింక!" అన్నాడు రంగడు.

"నెత్తి మొత్తుకున్నట్లుందిలే. ఆ మాయదారి కూతురి మిాద ఎంత జాలయ్యా నీకు. ఒకతికి మించిన దొంకతి."

"పెద్దామె ఎటువంటిదైనా...నీ కోడలు చేనా మంచి పిల్లమ్మా...నీకు తెల్దులే..." అన్నాడు ఉత్సాహంతో వొప్ప జెప్పే ధోరణిలో రంగడు.

"నా కోడలంటా వేమిరా. అదా నా కోడలు. ఆ గయ్యాళి గంప. తల్లికిమించిన భడవ! నిన్ను ఒకే రోజుకు తిక్కెత్తించి చంపేయదూ" అని లోపలికి వెళ్లింది సుబ్బమ్మ.

"నీకు తెల్దులేమ్మా..." అంటూ రంగడూ లోపలికి వచ్చాడు.

చుక్కమ్మ అన్నం తీసుకొని రాగానే అందరూ భోజనం చేశారు.

భోజనంచేస్తున్నప్పుడే ... "నా కూతుర్ని నీ ఆడంగి కొడుక్కు చస్తే యివ్వనని" చుక్కమ్మ, "నీ గయ్యాళిగంపను నా లక్షణమైన కొడుక్కు తీసుకోనే తీసుకోనని" సుబ్బమ్మ బిగ్గరగా అరుచుకొని శపథాలు చేసుకొన్నారు.

తనకు రంగడికి ఇక పెళ్లిచేయరని రాజి దృఢ పరచుకొంది.

ఆ రాత్రి చుక్కమ్మ సుబ్బమ్మ బిగ్గరగా అరుచుకొని అలసి పోయి పడుకొన్నారు.

ఉదయం లేవగానే కొడుకు కోసం చూసింది సుబ్బమ్మ. కొడుకును పిలుచుకొని వూరికెళ్లిపోవాలని ఆమె నిర్ణయించు కొంది.

కళ్ళు తెరవగానే రాజికోసం ప్రక్కకు చూసింది చుక్కమ్మ. ఇక రంగణ్ణి కన్నెత్తికూడా చూడకని నిక్కచ్చిగా రాజికి చెప్పేయాలని తీర్మానించు కొందామె.

పక్కలో రాజి కనిపించ లేదు. పెరట్లో వుందేమోనని వెళ్తే అక్కడా కనిపించలేదు. వీధిలో కళ్లేప చల్లి ముగ్గులు పెడు తోందేమోనని వీధిలోకి వెళ్లి చూసింది. అక్కడా కనిపించలేదు.

సుబ్బమ్మకూ కొడుకు కనిపించలేదు. ఇద్దరూ కంగారు పడినారు.

ఇంతలో ఎదురింటావిడ నిప్పుకోసం అక్కడికొచ్చి, "ఏమమ్మా అట్లా దిగులుగా వున్నారూ?" అని అడిగింది.

"ఈ పిల్లెక్కడా అని చూస్తున్నా?" అంది చుక్కమ్మ.

"మా వాడెక్కడా అని చూస్తున్నాను" అంది సుబ్బమ్మ.

"ఇంకేం! నా కెప్పుడో తెలుసు. ఇదంతా ఈ సుబ్బమ్మ చేసిన ఏర్పాటే. అన్ని విధాలా నిన్ను నిలువునా ముంచేయాలని ఈవిడ మెత్తు! ఆ రంగడు పోచికోలు కబుర్లు చెప్తుంటాడని ఏమో అనుకున్నాం గానీ...గట్టివాడే మొత్తానికి. మెల్లగా పిల్లను కాస్తా లేవదీసుకు పోయాడు" అంది ఎదురింటావిడ బిగ్గరగా.

"అయ్యో ఆ గయ్యాళిపిల్లకోసం నేను పడి చచ్చానంటా వామ్మా! అది నా కడప తొక్కితే వీప్పగల గొట్టేస్తాను. ఎదవ నాతో ఒక్క మాటయినా అనకుండా ఎంత పని చేసేడూ?" అని రాగం తీసింది సుబ్బమ్మ.

"మంచి ఘటికుడే మొత్తానికి నీ కొడుకు" అంది మళ్ళీ ఎదురింటావిడ.

"ఏడ్సి నాళ్ళే! వాడి గట్టితనం నాకు తెల్దూ. వాడో చవట పీనిగ! ఇంకా మా పిల్ల ఘటికురాలు. అదే లేవ దీసుకొని పోయుంటుంది ఆ ఆడంగి ఎదవని. బుద్ధిలేని కూతుర్లే! ఇంకెక్కడా మొగుడే దొరకడని ఈ ఎదవని లేవనెత్తుకు పోయింది" అని విసురుగా లోపలికి వెళ్లిపోయింది చుక్కమ్మ.

"అవ్వ" అని ముక్కుమీద వేలేసు కొన్నారు మిగిలిన ఇద్దరున్నూ!.